# అతిరాత్ర మహాయాగ సంక్షిప్త పరిచయం



"సంస్కృతమిత్ర"

**డా॥ రేమెళ్ళ అవధానులు**

**శ్రీ వేదభారతి**

హైదరాబాద్

**2014**

# అతిరాత్ర మహాయాగ
# సంక్షిప్త పరిచయం

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ముందుమాట | 5 |
| 2. | వేదాలు–విశేషాలు | 10 |
| 3. | సనాతన ధర్మం - విశేషాలు | 18 |
| 4. | యజ్ఞాలు–విశేషాలు | 22 |
| 5. | అతిరాత్రం–విశేషాలు | 38 |
| 6. | అతిరాత్రం–అనుష్ఠానం | 45 |
| | అనుబంధం | 58 |

# అతిరాత్రం

## 1. ముందుమాట

దేశంలో అనేక ధార్మిక సంస్థలు, ఆశ్రమాలు, మఠాలు, మందిరాలు, ఇంకా ఎన్నో సంస్థలు, ఎందరో మహానుభావులు వేదవిద్యను పరిరక్షించుకోవాలని, వేదమాత యొక్క అనుగ్రహాన్ని యజ్ఞయాగాల అనుష్ఠానం ద్వారా సమాజంలోని పదిమందికీ అందించాలనీ, దానిద్వారా సుఖశాంతులతో విలసిల్లే సమాజాన్ని దర్శించాలనీ, నిరంతరం కృషిచేస్తున్నారు. దానికి సంబంధించిన వనరులను, వసతులను, వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నారు. వృద్ధిచేస్తున్నారు. తిరిగి వేదాలలో ప్రతిపాదించబడిన కర్మానుష్ఠానము చిగుళ్ళువేసి, పువ్వులు పూసి, కాయలుకాసి, ఫలాలుగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇదంతా ధర్మస్వరూపుడైన జగన్నాథుని యొక్క అనుగ్రహంగా భావించవలసి ఉంది.

### శ్రీ మహావిష్ణువు – మోక్షప్రదాత

ఒక ప్రాచీన శ్లోకం ఇట్లా ఉంది –

**ధర్మప్రతిబద్ధమూలః వేదస్కంధః పురాణశాఖాఢ్యః**
**క్రతుకుసుమః మోక్షఫలదః మధుసూదనపాదపో జయతి ॥**

శ్రీ మహావిష్ణువును ఒక మహావృక్షంతో ఈ శ్లోకంలో పోల్చడం జరిగింది. ఆ వృక్షానికి ధర్మము వేళ్ళు, వేదము మ్రాను, ఇతిహాస పురాణాలు కొమ్మలు. యజ్ఞయాగాలు ఆ మహా వృక్షానికి పూసే పుష్పాలు. ఆ పుష్పాలు కాయలుగా మారి, మోక్షం అనే ఫలాలను ఇస్తాయి. ఈ విధంగా మోక్షం అనే ఫలాన్ని అందించే శ్రీ మహావిష్ణువు మనలను రక్షించుగాక అని స్థూలంగా అభిప్రాయం.

## అగ్నిలో ఆజ్య హోమం - లోకోపకారకం

అగ్నిలో హోమం చేయబడే ఆజ్యము (ఆవునెయ్యి), పాలు, పెరుగు మొదలైన ద్రవ్యాలు అన్నీ ఆదిత్యుని వద్దకు జేరి, తిరిగి సకాల వర్షాన్ని అందించి, భూమిని కల్మషరహితంగా ఉంచుతూ, సస్యశ్యామలం చేస్తాయని వేదంలో పేర్కొనడం జరిగింది.

## భోపాల్‌లో సత్య నిరూపణ

ఈ మధ్య కాలంలో భోపాల్‌లో జరిగిన విషవాయు ప్రమాదంలో అనేకులు మరణించగా, అగ్నిహోత్రాన్ని ఆజ్యాదుల ద్వారా సేవిస్తున్నవారు ప్రమాదరహితంగా బయటపడ్డారనే వార్త పై విషయాన్ని దృఢపరుస్తోంది.

## కేరళలో సత్య నిరూపణ

యుగ యుగాలకు ముందు ఆవిష్కరించుకొనిన వేదాలు నిత్యసత్యాలు. ఎప్పుడో దశరథుడు యజ్ఞం చేశాడు, శ్రీరాముడు అవతరించాడని పెద్దలు పిల్లలకు కథల రూపంలో చెబుతూ ఉంటే, అదేదో ఆ కాలంలో జరిగింది, అటువంటిది ఈ కలియుగంలో అసంభవం అని ఎక్కువమందికి అభిప్రాయం ఏర్పడిన ఈ రోజుల్లో, తిరిగి వేదాల యొక్క గొప్పదనాన్ని కళ్ళకు కట్టినట్లుగా చూపించడం కొరకు తీవ్రమైన కృషిచేస్తున్న మహానుభావులు ఈ రోజుల్లో కూడా కనిపిస్తున్నారు. ఈ దృష్టితోనే కేరళలో నంబూద్రి కుటుంబీకులు ప్రాచీన సంప్రదాయ పద్ధతిలో, సంపూర్ణ విశ్వాసంతో, అతిరాత్రం అనే ఒక మహాయాగాన్ని 1990లో బహిరంగంగా అనుష్ఠానం చేసి, యజ్ఞము శాశ్వతమైనదని, యజ్ఞాన్ని సరిగ్గా చేస్తే, ఈ కలియుగంలో, ఇప్పుడు కూడా ఆ ఫలాన్ని చూడవచ్చుని నిరూపించారు. చూసినవారిలో సైంటిష్టులు, నిరీశ్వరవాదులు, అధికారులు, దేశవిదేశాల నుండి వచ్చిన పండితులు, పామరులు – అందరూ ఉన్నారు.

## యజ్ఞాల పునర్వైభవానికి గట్టి ప్రయత్నం

ఇలా జరగడం ఏదో ఒకసారి యాదృచ్ఛికంగా జరిగి ఉంటుందని కొందరు చేసే దుష్ప్రచారాన్ని ఖండించడానికి,

అదే అతిరాత్రి మహాయాగాన్ని ఒకసారి కాదు – అనేక పర్యాయాలు, ఒకచోట కాదు – అనేక ప్రదేశాలలో, ఒకే పండితగణం ద్వారా కాదు – సుశిక్షుతులైన అనేకపండిత గణాల ద్వారా, దీనిని అనుష్ఠానం చేయించి, ఒక మహోన్నతమైన లక్ష్యంతో, దృఢ సంకల్పంతో, దీక్షతో కృషిచేస్తున్నవారు డా॥ రాజిరెడ్డిగారు. నిష్కామంగా, సమాజశ్రేయస్సే ధ్యేయంగా చేస్తున్న వారి కృషి లోక కళ్యాణాన్ని, పరమేశ్వరుని అనుగ్రహంతో, అతి త్వరలోనే ఆవిష్కరింపజేస్తుంది. ఆ సందర్భంలో అక్కడకు వచ్చే అశేష జనవాహినికి చేసే అద్భుతమైన అన్నదానము అపూర్వమైన ఫలాన్ని ఇస్తుంది. ఇందులో ఎవరికీ ఎటువంటి సందేహమూ ఉండవలసిన అవసరము లేదు. వారి కృషికి అందరూ సహకరించవలసిన ఆవశ్యకతను గుర్తుచేసుకుందాం!

అయితే, ఈ సందర్భంలో కొన్ని ప్రాథమికమైన విషయాలను మనం కూడా తెలుసుకోవలసి ఉంది. ముఖ్యంగా – వేదం అంటే ఏమిటి? మంత్రం అంటే ఏమిటి? యజ్ఞం అంటే ఏమిటి? అతిరాత్రం అంటే ఏమిటి? దీని నిర్మాణాన్ని ఎట్లా చేస్తారు? ఆ యజ్ఞంలో ఇమిడి ఉన్న ప్రధాన అంశాలేమిటి? వీటిగురించి పూర్వం నుండి మనకు లభించిన అనుభవజ్ఞానం ఏమిటి? – ఇటువంటి విషయాలను

సంక్షిప్తంగా అందించాలనే ఉద్దేశ్యంతో ఈ చిన్ని పుస్తకాన్ని సంకలనం చెయ్యడం జరిగింది. దీనిద్వారా మన ప్రాచీన జ్ఞాన వైభవాన్ని కొంతవరకైనా తెలుసుకున్న వాళ్ళమవుతామని ఆశ ! పరమేశ్వరుడు మనందరికీ ధర్మాచరణ చేయాలనే సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకుందాం !

సర్వేజనాస్సుఖినో భవంతు ॥

ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః